క్లుప్తంగా

ట్రాఫిక్ మళ్లింపు

మదనపల్లె రూరల్ : వినాయక చవితి పర్వదినం సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని ట్రాఫిక్ సీఐ గురునాథ్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ... డీఎస్పీ మహేంద్ర ఆదేశాలతో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందన్నారు. బుధవారం వినాయకచవితి పర్వదినం నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు. అనంతపురం, కదిరి, కడప, ములకలచెరువు, కురుబలకోట వెళ్లే బస్సులు ఆర్టీసీ బస్టాండ్ నుంచి గొల్లపల్లె సర్కిల్ పాత బైపాస్‌రోడ్డు, చౌడేశ్వరి కల్యాణమండపం మీదుగా వెళతాయన్నారు. పట్టణంలోకి వచ్చే బస్సులు నీరుగట్టువారిపల్లె కదిరిరోడ్డు, అనిబిసెంట్ సర్కిల్, మల్లికార్జున సర్కిల్, జెడ్పీహైస్కూల్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకుంటాయన్నారు. బెంగళూరు వైపు వెళ్లే ప్రైవేట్‌బస్సులకు బీటీ కాలేజ్ గ్రౌండ్‌లో పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ బస్సులను బెంగళూరు బస్టాండులోకి అనుమతించేది లేదన్నారు. ప్రజలు, ప్రయాణికులు ఈ మార్పును గమనించి పోలీసుశాఖకు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

జూదరుల అరెస్టు

కలికిరి: రెండు వేర్వేరు ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న 15 మందిని అరెస్టు చేసినట్లు సీఐ అనీల్‌కుమార్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు... కలికిరి జేఎన్టీయూ సమీపంలో సోమవారం రెండు ప్రాంతాల్లో పేకాట జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించగా 15 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.27,520 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దాడులలో హెడ్‌కానిస్టేబుల్‌లు మదన్‌మోహన్ రెడ్డి, మహమ్మద్ అలీ, రాజేంద్రప్రసాద్, పీసీలు యల్లరాజు, వెంకటరమణ, గిరిప్రసాద్, హోంగార్డులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

తంబళ్లపల్లె: రాష్ట్ర స్థాయిలో నిర్వహించే షూటింగ్‌బాల్ జూనియర్ బాల, బాలికల పోటీలకు మోడల్ స్కూల్ నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్, పీడీ లత సోమవారం తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థి గౌస్‌అహ్మద్, తొమ్మిదో తరగతి హర్షవర్ధన్, పదో తరగతి కరీమున్నీసా జిల్లా జట్టులలో స్థానం దక్కించుకున్నట్లు తెలిపారు.

స్వామిత్వ సర్వే పూర్తి చేయాలి

రామసముద్రం: స్వామిత్వ సర్వే త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ గఫూర్ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పిజిఆర్ఎస్, స్వామిత్వ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఇంటింటా చెత్త సేకరణ చేసి డంపింగ్ యార్డులకు తరలించాలని ఆదేశించారు. అలాగే ఐవిఆర్ఎస్ ఫోన్ కాల్స్ వచ్చినపుడు ప్రతి ఒక్కరు ఒకటి నొక్కాలని, ఇది గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే స్వామిత్వ సర్వే నిర్లక్ష్యం చేయకుండా అందరూ ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలన్నారు. మండల స్థాయి అధికారులు ఏపీవో మాధవి, ఏఈ మస్తాన్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.


దళిత, గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

కేవీపల్లె : మండలంలో దళిత, గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ ఉమ్మడి చిత్తూరు జిల్లా కన్వీనర్ ముల్లంగి చంద్రయ్య అన్నారు. సోమవారం వివిధ సమస్యలపై తహసీల్దార్ నరేంద్రకుమార్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పలు సమస్యల గూర్చి అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోలేదన్నారు దళిత, గిరిజనుల సమస్యలు పట్టించుకోకుండా అగ్రవర్ణాలకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. బైనేనిపల్లి హరిజనవాడలో స్మశాన వాటిక స్థలం ఆక్రమణకు గురైందన్నారు. మారేళ్ల పంచాయతీలో యానాదులకు సంబంధించి 10.5 ఎకరాలను దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని తెలిపారు. ఈ సమస్యల తోపాటు దళితవాడల్లో సమస్యలపై రెవెన్యూ, పోలీస్, మండల అభివృద్ధి అధికారులకు విన్నవించినా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

నైపుణ్యాలను పెంచుకోవాలి

మదనపల్లె సిటీ: విద్యార్థులు కార్పొరేట్ అవసరాలకు తగ్గట్టు తమ నైపుణ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉందని టెక్ వేద టెక్నాలజీస్ డైరెక్టర్లు సునిల్, దినేష్ అన్నారు. సోమవారం చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో కెరీర్ గ్రూమింగ్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు డేటా అనలిస్టు, డేటా ఇంజినీరింగ్, సైబర్‌సిటీ తదితర అంశాలపై వివరించారు. కాలేజీ డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ రామమోహన్‌రెడ్డి, చైర్మన్ నాగమల్లారెడ్డి, ప్రిన్సిపాల్ పి.రాయుడు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ కన్వీనర్ నియామకం



మదనపల్లె: మదన పల్లె ప్రెస్ క్లబ్ కన్వీనర్‌గా టి.షామీర్‌బాషాను ఎన్నుకున్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. అధ్యక్షుడు రమేష్ పదవీకాలంలో చేపట్టిన కార్యక్రమాలపై చర్చ జరిగిన అనంతరం కమిటిని రద్దు చేస్తూ సమావేశం తీర్మాణం చేసింది. తర్వాత ప్రెస్‌క్లబ్ కన్వీనర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అభివృద్ధి పనులు అధికారుల ఇష్టారాజ్యమా

- కౌన్సిలర్లకు తెలియకుండా అజెండాలో ఎలా పెట్టారు
- బాగున్న రోడ్లపైనే మళ్లీ రోడ్లేస్తారా
- మున్సిపల్ మీట్‌లో కౌన్సిలర్ల ఆగ్రహం



అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైస్ చైర్మన్ జింకా చలపతి

మదనపల్లె: మదనపల్లె మున్సిపాలిటిలో అభివృద్ధి పనులు చేపట్టడం అధికారుల ఇష్టారాజ్యమా, వార్డుల్లో కౌన్సిలర్లకు తెలియకుండా పనులు ఎంపిక చేసుకుని అజెండాలో పెడ్తారా, సమస్యలు, ప్రతిపాదనలపై కౌన్సిలర్లకు, చైర్మన్‌కు కూడా సమాచారం ఇవ్వరా అంటూ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం చైర్‌పర్సన్ మనూజరెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు నిర్వహించారు. సమావేశానికి కమిషనర్ ప్రమీల హాజరుకాలేదు. ఆమె స్థానంలో మేనేజర్ పీఆర్.మనోహర్ హాజరయ్యారు.

నిధుల దోపిడికే పనులు

అజెండా అంశాలపై ఆమోదానికి చర్చ మొదలవగానే.. త్యాగరాజవీధి–హోప్ హైస్కూల్, సిపాయి వీధి, వాసవీ ఆర్చ్ వీధి, నెహ్రూ బజార్, కోట వీధిలో సిమెంటురోడ్లు బాగుండగా వాటిపైనే మళ్లీ రూ.65.09 లక్షలతో కొత్త రోడ్లకు ఎవరు ప్రతిపాదించారని వైస్ చైర్మన్ జింకా వెంకటా చలపతి రోడ్ల ఫొటోలను ప్రదర్శిస్తూ నిలదీశారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం నిమ్మనపల్లెరోడ్డు నుంచి కదిరిరోడ్డు వరకు 100 అడుగుల రోడ్డుకు ఆమోదం ఉండగా 80 అడుగులకే రూ.1.37 కోట్లతో మురికినీటి కాలువ నిర్మాణం ఎలా చేపట్టారని నిలదీశారు. ఇలా చేయడం ద్వారా అధికారుల వ్యవహారశైలిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. ఒకసారి 80 అడుగుల ప్రాతిపదిక కాలువ నిర్మిస్తే 20 అడుగుల రోడ్డును కోల్పోవడం ద్వారా ట్రాఫిక్‌కు, ప్రజలకు కలిగే ఇబ్బందిని ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రోడ్లపైనే మళ్లీ రోడ్లు వేయడంపై కౌన్సిలర్లు గాంధీ, వసీం, ప్రసాద్, రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధుల దోపిడీకి అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారన్నారు. కౌన్సిలర్ కరీముల్లా మాట్లాడుతూ తమవార్డులో అధికారులకు తమకు చెప్పకుండానే పనులు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచే శారు. తర్వాత గాంధీ, కరీముల్లా, తులసీ సమావేశం నుంచి వెళ్లిపోయారు. మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోలేని టిడ్కో ఇళ్ళ సముదాయానికి మున్సిపల్ నిధులు రూ.11 లక్షలతో విద్యుత్ దీపాల ఏర్పాటుకు ఎలా ఖర్చు చేస్తారని వైస్ చైర్మన్ జింకా చలపతి ప్రశ్నించారు. మున్సిపల్ నిధులతో కాకుండా ప్రభుత్వ గ్రాంటుతో ఖర్చు చేయాలని కోరారు. నక్కలదిన్నెలో రూ.1.32 కోట్లతో చేపట్టిన నీటి సరఫరా పనికి అదనంగా రూ.30 లక్షల మున్సిపల్ సాధారణ నిధులు మంజూరు చేయాలని అధికారులు ప్రతిపాదించగా తిరస్కరించారు. నిధులు ఇచ్చే అవకాశం ఉందా లేదా అని చర్చించకుండానే అజెండాలో పెట్టారని నిలదీశారు. తాగునీటి పనులకు సంబంధించి కౌన్సిలర్లు ఎవరూ విన్నవించకపోయినా, వారికి తెలియకుండా అజెండాలో ఎలా పెట్టారని ప్రశ్నించారు. కౌన్సిల్‌ను తప్పుదోవ పట్టిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వారపుసంత, మార్కెట్‌లో గేటు వసూళ్లు ఎందుకు తగ్గాయని, సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళ్తోందని ప్రశ్నించారు.

సచివాలయాలు నిర్వీర్యం

మున్సిపాలిటిలో 44 సచివాలయాలు నిర్వీర్యం అయ్యాయని కౌన్సిలర్లు ఖాజా, రాజేష్ అన్నారు. ఉద్యోగులు ఎప్పుడుంటారో లేదో తెలియదు, ప్రజలకు ఒక్క పని జరగడం లేదు, ఒక్క ధృవీకరణ పత్రమూ తీసుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించగా ప్రస్తుతం ప్రజలకు సేవ చేయడం లేదన్నారు.

నోటీసులతో ఊరుకుంటారా

పట్టణంలో అక్రమణలపై కౌన్సిలర్ ప్రసాద్ ప్రస్తావించగా నోటీసులు ఇస్తున్నామని టౌన్‌ప్లానింగ్ ఉద్యోగి రెడ్డెమ్మ చెప్పడంతో చైర్‌పర్సన్ మనూజరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లు, స్థలాలు ఆక్రమణలకు గురవుతుంటే నోటీసులు ఇచ్చామని ఊరుకుంటారా, ఇలా చేస్తే ఆక్రమణలు తొలగించడం, వాటికి అడ్డకట్ట వేయడం సాధ్యమా అని నిలదీశారు. దీనిపై స్పష్టమైన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు. వైస్‌చైర్మన్ నూర్ ఆజం మాట్లాడుతూ ప్రజలు కుక్కకాటుకు గురవుతున్నారని ఎన్ని సమావేశాల్లో చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు సరిత,శ్రీనివాసులు, శివారెడ్డి, షేక్ షబానా, షేక్ జింకా రాధమ్మ, రజనీ, సుగుణ, ముబీనా, రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్, సుగుణ, మొబిషిరా మోమిన్, అధికారులు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డికి బెయిల్ మంజూరు కావాలని పూజలు



వాల్మీకిపురంలోని శివాలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల, నాయకులు



మల్లయ్యకొండపై పూజలు నిర్వహిస్తున్న నిసార్ అహ్మద్, తదితరులు

కలికిరి(వాల్మీకిపురం): రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డికి త్వరితగతిన బెయిల్ మంజూరవ్వాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వాల్మీకిపురంలోని కోనేటివీధి శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి నేతలకు రాష్ట్రంలో దౌర్జన్యాలు, అక్రమాలు, అవినీతి, ఆక్రమణలు, అఘాయిత్యాలకు ప్రజలు అధికారమిచ్చినట్లు ఉంది తప్ప పాలనకు అధికారమిచ్చినట్లు లేదని, రాష్ట్రంలో పాలనను గాలికి వదిలేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందని ఆరోపించారు. పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని కూటమి ప్రభుత్వం జరగని లిక్కర్ స్కామ్‌లో ఇరికించి అక్రమంగా అరెస్టు చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతల శివానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నీళ్ళ భాస్కర్, పంచాయతీ రాజ్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బిడ్డల కేశవరెడ్డి, మండల కన్వీనర్ పులి శివకుమార్‌రెడ్డి, శ్రీధర్ రాయల్, సురేష్‌కుమార్‌రెడ్డి, చలపతి, శ్రీనివాసులు రెడ్డి, రాజాబాబు, ఆనంద, భూమా గంగులమ్మ, సుధాకర్, చంద్రశేఖర్, రమేష్‌బాబు, నాగరాజ, రాయుడు, రవీంద్రబాబు, మునిభాస్కర, ఇబ్రహీం ,గంగిరెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ఆలయంలో..

మదనపల్లె: మద్యం అక్రమ కేసులో ఎంపీ మిథున్ రెడ్డికి బెయిలు రావాలని ప్రార్థిస్తూ మదనపల్లె రూరల్ మండలంలోని వేంపల్లె సమీపంలో కొండపై వెలసిన మల్లికార్జునస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ మదనపల్లె సమన్వయకర్త నిసార్ అహ్మద్ పూజలు నిర్వహించారు. సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి కాలినడకన వెళ్లిన ఆయన ఆలయంలో పూజలతోపాటు 101 టెంకాయలు కొట్టి ప్రార్థించారు. ఆలయం దిగువన మిథున్‌రెడ్డి బ్యానర్లను ప్రదర్శిస్తూ అక్రమంగా అరెస్ట్ చేశారంటూ నిరసన వ్యక్తం చేశారు. మల్లికార్జున స్వామి ఆశీస్సులతో బెయిలు మంజూరు కావాలని వేడుకొంటూ ప్రార్థించారు. కార్యక్రమంలో కొత్తపల్లె మహేష్, చిప్పిలి జగన్నాధ్‌రెడ్డి, మునిశేఖర్, నరసింహులు, మల్లికార్జున, ఈశ్వర్‌నాయక్, శంకర్‌నాయక్, శ్రీకాంత్, మధు, సాధిక్, యాసీన్ పాల్గొన్నారు.

కడప దర్గాలో..

ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిలు మంజూరు కావాలని వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఏ.కరీముల్లా కడప పెద్దదర్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు. ఆదివారం రాత్రి పార్టీనేతలతో కలిసిన వెళ్లిన ఆయన దర్గాలో మిథున్‌రెడ్డి కోసం ప్రార్థనలు చేశారు.

చవితి విగ్రహాలు వితరణ

పెద్దతిప్పసముద్రం: వినాయక చవితి పండుగ సందర్భంగా శివాలయం సేవకులు ననగరం పట్టాభి రామయ్య 21 మందికి మట్టి విగ్రహాలను ఉచితంగా అందజేసి స్వామి భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ఆలయంలో జరిగే ప్రతి పూజా కార్యక్రమాల్లో పాలు పంచుకుని వారి వంతు సేవలందించే భక్తులకు విగ్రహాలతో పాటు పూజాసామగ్రి కొనుగోలు కోసం ఒకొక్కరికి రూ.200 నగదు అందజేసామన్నారు.

సొసైటీ బ్యాంకులో కంప్యూటర్ ఆధారిత సేవలు

పెద్దతిప్పసముద్రం: సొసైటీ బ్యాంకుల్లో పూర్తిగా కంప్యూటర్ ఆధారిత సేవలను అందిస్తున్నామని బ్యాంకు సీఈఓ చంద్రశేఖర్, మేనేజర్ శివారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సొసైటీ బ్యాంకులో మేనేజర్ అధ్యక్షతన ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకర్లు పంట రుణాలు, మార్టిగేజ్ రుణాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ వల్ల కలిగే లాభాలు, బంగారంపై తాకట్టు రుణాలు, వడ్డీల వివరాలు, పీఎం సూర్యాఘర్ పథకం, పీఎం ఇన్సూరెన్స్ పాలసీ, అటల్ పెన్షన్ యోజనా పథకంతో పాటు వాటి వల్ల కలిగే ప్రయోజనాలపై రైతాంగ ఖాతాదారులకు అవగాహన కల్పించారు.

క్షయ నివారణకు ప్రజల భాగస్వామ్యం అవసరం

నిమ్మనపల్లె: క్షయ నివారణకు ప్రజల భాగస్వామ్యం అవసరమని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ అధికారి మహమ్మద్ రఫీ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారి ఆదేశాల మేరకు బి. పర్యవేక్షకులు నాగిరెడ్డి తో కలసి మండలంలోని తవళంపంచాయతీ ఎగువపల్లిలో నిర్వహిస్తున్న 104 సేవలకు హాజరైన ప్రజలకు టి. బి ముక్త్ భారత్ కాంపెయిన్ లో భాగంగా క్షయవ్యాధి పై అవగాహన కల్పించారు. టీబీ లక్షణాలు ఉంటే తగిన వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో గళ్ల పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలలు మందులు ఉచితంగా ఇస్తారన్నారు. ప్లకార్డులు ప్రదర్శించి, ప్రతిజ్ఞ చేశారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం

పీలేరురూరల్ : వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం అవుతాయని తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీగిరీష అన్నారు. సోమవారం పీలేరు పట్టణం కోటపల్లెలోని ఏపీ గిరిజన బాలికల పాఠశాలలో విద్యార్థినులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచి విద్య మేలైన ఆరోగ్యంతో సాధ్యమని తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ములకలచెరువు: మండలంలోని చౌడసముద్రం పంచాయతీ సుంచువారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పి.రవి(38) అనారోగ్యంతో రెండు నెలల క్రితం మృతిచెందాడు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికంగా ఆదుకుంటానని, పిల్లల చదువుల కోసం ఆర్థికంగా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. ఇందులో భాగంగా మృతుడి కుటుంబ సభ్యులకు స్థానిక నాయకుల చేతుల మీదుగా రూ. లక్ష నగదు సోమవారం మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. మృతుడి భార్య పి. సుజాత, ఇద్దరు పిల్లలకు ఆర్థిక సహాయం స్థానిక నాయకులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డెం క్రిష్ణారెడ్డి, శేఖర్‌గుప్తా, డాక్టర్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ మల్లేశ్వరీ, రెడ్డెప్ప, జయరాంరెడ్డి , నాగరాజు, శివ, భాస్కర, సుధాకర్, కొలిమి కిట్టా తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కేవీపల్లె : వైఎస్సార్‌సీపీలో వివిధ విభాగాల్లో పదవులు పొందిన నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. కేవీపల్లె మండలానికి వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి చామంచుల సిద్ధయ్య, జిల్లా వైద్య విభాగం కార్యదర్శి డాక్టర్ ఆంజనేయులు, జిల్లా యూత్ కార్యదర్శి మద్దిపట్ల కిరణ్, మండల రైతు విభాగం కార్యదర్శి మునలి ధనుంజయరెడ్డి సోమవారం వాల్మీకిపురంలో మాజీ ఎమ్మెల్యేని కలసి పార్టీలో సముచిత స్థానం కల్పించినందుకు దుశ్శాలువతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని, కూటమి ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కోర్టు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలకడ : వైఎస్సార్ సీపీ బలోపేతానికి యువత కలిసి పనిచేయాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం పార్టీలో వివిధ స్థాయిలలో పదవులు పొందిన వారు మాజీ ఎమ్మెల్యేని కలిసి సన్మానించి, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. యువతకు పార్టీలో పదవులు కల్పించినందుకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ఎంపీ పీవీ మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మండల యువత అధ్యక్షులు కావూరి రామ్‌గోపాల్‌నాయుడు, ఎర్రకోటపల్లె గ్రామ కమిటీ అధ్యక్షులు బొమ్మక విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా సోషల్ మీడియ కార్యదర్శి శశిధర్‌రెడ్డి, రామాంజులు, పవన్‌కుమార్‌రెడ్డి, కిరణ్‌కుమార్, ఈశ్వర్‌నాయక్, తిరుపాల్‌నాయుడు, శశి, రమణ,శీన, బాలాజీనాయక్ ఉన్నారు.

అన్నదాన షెడ్ల నిర్మాణానికి 1.70 లక్షల విరాళం

తంబళ్లపల్లె: మల్లయ్యకొండ కింద అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మిస్తున్న షెడ్డు ఏర్పాటుకు ఎర్రసానిపల్లె సర్పంచు సుగుణమ్మ, భర్త వీరభద్రులు రూ.1.70 వేలు విరాళంగా ఇచ్చారు. సోమవారం విరాళం చెక్కును అన్నదాన కమిటీ సభ్యులకు అందజేశారు. మహాశివరాత్రి పర్వదినాన మల్లయ్యకొండకు వచ్చే లక్షలాది మంది భక్తులకు అన్నసంతర్పణ జరుగుతుంది. భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న షెడ్ల ఏర్పాటుకు పలువురు దాతలు సహకరిస్తున్నారు. దాత దాతృత్వాన్ని సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, ట్రస్టు జనరల్ సెక్రటరీ నారాయణరెడ్డి, సభ్యులు భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమణారెడ్డి, మురళి,వెంకటరమణారెడ్డిలు అభినందలు తెలిపారు.

మంచి సమాజం కోసం కృషి చేద్దాం



మానవత సంస్థ సభ్యులచేత ప్రమాణం చేయిస్తున్న రామచంద్రారెడ్డి

కలకడ : రాష్ట్ర వ్యాప్తంగా కుల,మతాలు, రాజకీయాలకు అతీతంగా మంచి సమాజం కోసం మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ద్వారా కృషి చేద్దాం అని ఆ సేవాసంస్థ వ్యవస్థాపకులు ఎస్.రామచంద్రారెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం కలకడ మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. 2004లో రంగారెడ్డి జిల్లా కొత్తగూడెంలో రోడ్డుపై ప్రమాదం జరగడంతో అక్కడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న కడప జిల్లాకు చెందిన ఎస్.రామచంద్రారెడ్డి అత్యవసరానికి అంబులెన్స్ లేకపోవడంతో చలించిపోయి గాయపడిన వ్యక్తిని కాపాడటానికి చేసిన ప్రయత్నం సఫలీకృతమైనట్లు తెలిపారు. అనంతరం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 108ను ప్రారంభించడంతో సమస్య తీరినట్లు తెలిపారు. సమాజసేవ కోసం కేవలం 108 మంది సభ్యులతో అప్పట్లో మానవత సంస్థ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంచలు, అంచలుగా ఎదిగి ప్రస్తుతం రాష్ట్రంలో 86 మండలాల్లో వేలాదిగా సభ్యులు చేరి మహావృక్షం మాదిరి మానవత సంస్థ ద్వారా సేవలు అందించడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు జె.క్రిష్ణమూర్తి (జె.కె.సార్), జిల్లా అధ్యక్షుడు సహదేవరెడ్డి , కడప జిల్లా అధ్యక్షులు బ్రంహ్మారెడ్డి కార్యవర్గ సభ్యులు దగ్గుపాటి. వెంకటేశ్వరరావు, పివినాయుడు, శ్రీనివాసులురెడ్డి, మాదవరెడ్డి, రమణ, సయ్యద్‌సాహెబ్,పివినాయుడు, గంగాద్రినాయుడు, వైవిరమణ, పివిరమణ, నాగరాజ, లక్ష్మన్న, జివిరమణ పాల్గొన్నారు.

కలకడ మండల శాఖ

మండల మానవత సంస్థ కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నట్లు అన్నమయ్య, చిత్తూరు జిల్లాల అధ్యక్షులు జె.క్రిమూర్తి (జె.కె), సహదేవరెడ్డి తెలిపారు. మండల శాఖ అధ్యక్షుడిగా పి.సయ్యద్‌సాహెబ్, కార్యదర్శిగా పివి నాయుడు, కోశాధికారిగా యంఎస్ ఖాజాఫీర్, ఉపాధ్యక్షుడిగాజి.వెంకట్రమణ, సంయుక్త కార్యదర్శిగా పి.వెంకట్రమణ, సభ్యులుగా బి.మోహన్, వై.నాగేశ్వర, ఎస్.జయప్రకాష్, కె.శ్రీనివాసులును ఎంపిక చేశారు.

యూరియాను బ్లాక్ చేస్తే లైసెన్స్ రద్దు చేస్తాం



ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేస్తున్న తహసీల్దార్, కడప విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

గుర్రంకొండ: యూరియాను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని కడప విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రహంతుల్లాబాషా, తహసీల్దార్ ప్రసన్నలక్ష్మీ అన్నారు. సోమవారం మండలకేంద్రమైన గుర్రంకొండలోని పలు ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎరువుల గోడౌన్లను తనిఖీ చేశారు. స్టాకు రిజిష్టర్లు, పంపిణీ రిజిష్టర్లులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు ఎరువులను విక్రయించాలన్నారు. యూరియా ఇష్టానుసారం విక్రయించకూడదన్నారు. రైతుల దగ్గర ఆధార్ కార్డులు, పట్టాదారుపాసుపుస్తకాల జిరాక్స్ కాపీలు తీసుకొని యూరియా విక్రయించాలన్నారు. ఎరువులన కొనుగోలు చేసే ప్రతి రైతుకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలన్నారు. ధరల సమాచార బోర్డుల్లో ప్రతిరోజు కచ్చితంగా ఎరువుల ధరలు, స్టాకు వివరాలు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. సమాచార బోర్డులో ఉన్న ధరల మేరకే రైతులకు ఎరువులను విక్రయించాలన్నారు. ధరల్లో ఎటువంటి తేడాలున్నా సదరు వ్యాపారుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ నాగరత్నమ్మ, ఏఈవో నాగరాజు, వీఏవో అక్రమ్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

మదనపల్లె జిల్లా హామీని నిలుపుకోవాలి



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీవైఎస్ నాయకులు

మదనపల్లె రూరల్ : మదనపల్లె జిల్లాను ఏర్పాటుచేసి కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని నిలుపుకోవాలని బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ డిమాండ్ చేశారు. మదనపల్లె జిల్లా ప్రకటన ఎప్పుడు..? అంటూ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బహుజన యువసేన ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సోమవారం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, సమస్యలు తెలుసుకున్నారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాల నుంచి వివిధ సమస్యలపై 96 అర్జీలు అందాయి. బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్... ఎన్నికల ప్రచారంలో భాగంగా మదనపల్లెకు వచ్చిన చంద్రబాబు, నారాలోకేష్...కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మదనపల్లెను జిల్లాకేంద్రంగా చేస్తామని ఎన్నికల హామీ ఇచ్చారన్నారు. అయితే 14నెలలు పూర్తి అవుతున్నా ఇంతవరకు జిల్లా కేంద్రంగా ప్రకటించకపోగా, అదిగో ఇదిగో అంటూ ఊరిస్తున్నారన్నారు. మదనపల్లె మెడికల్ కాలేజీ పెండింగ్ పనులను పూర్తిచేసి 2026 విద్యాసంవత్సరంలో అడ్మిషన్లు తీసుకోవాలన్నారు.

– వాల్మీకిపురం మండలం పాతమంచూరు గ్రామానికి చెందిన ఎం.రమణకు వారసత్వంగా సంక్రమించిన భూమి ఆన్‌లైన్ చేయాలని అతడి కుమారుడు వినయ్‌కుమార్ సబ్ కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. భూసమస్యపై తన తండ్రి 2024 నుంచి మండల రెవెన్యూ కార్యాలయం, సబ్ కలెక్టరేట్ చుట్టూ పది సార్లుకు పైగా తిరిగారన్నారు. ముత్తాత లక్ష్మన్న 1976లో కలికిరి చిన్నరెడ్డెప్ప వద్ద 1.5 ఎకరాలను కొనుగోలుచేశారన్నారు. 1983లో లక్ష్మన్న కుమారుడు వెంకటాద్రి ఆ భూమిలో 50 సెంట్లు విక్రయించగా మిగిలిన ఎకరా పొలాన్ని రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ చేయలేదన్నారు.

– మదనపల్లె మండలం నక్కలదిన్నె చుక్కలతాండాకు చెందిన మునస్వామినాయక్, చాలా ఏళ్ల క్రితమే తనపేరు మీద డీకేటీ పట్టా మంజూరై తమ అనుభవంలో ఉన్నటువంటి భూమిని, రెవెన్యూ అధికారులు తనకు తెలియకుండా పట్టా రద్దుచేసి, వేరొకరికి మంజూరు చేశారని సబ్ కలెక్టర్ చల్లా కల్యాణికి ఫిర్యాదుచేశాడు.

సర్పంచ్ భర్త ఇబ్బందులకు గురి చేస్తున్నాడు

– సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె సర్పంచ్ పాపులమ్మ భర్త మల్లప్ప ఆక్రమణల తొలగింపు పేరుతో తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడంటూ దళితులు సోమవారం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తమ సమస్యను వివరిస్తూ వినతి పత్రాన్ని సబ్ కలెక్టర్ కళ్యాణికి అందజేసినట్లు తెలిపారు. నిమ్మనపల్లె పంచాయతీ కొత్త పల్లెకు చెందిన బాధితులు బత్తిన జయకృష్ణ, గుండ్లూరి వెంకటరమణ, సలాది గంగరాజు మాట్లాడుతూ... 50 సంవత్సరాల క్రితం తమ పెద్దలైన సలాది గంగన్న బత్తిన గురప్ప గుండ్లూరి వెంకటరమణ లకు, అప్పటి ప్రభుత్వం నిమ్మనపల్లె బస్టాండ్ లోని, సర్వేనెంబర్ 1143లో ఒక్కొక్కరికి వేరువేరుగా ఒక్కో చింత చెట్టు, రెండు సెంట్లు స్థలంతో పాటు డీకేటీ పట్టాలు మంజూరు చేసిందన్నారు. అప్పటినుంచి తాము ఫలసాయం అనుభవిస్తున్నామన్నారు. అక్కడ దళితుల ఆరాధ్య దైవం డాక్టర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారన్నారు. అయితే ప్రస్తుతం నిమ్మనపల్లి సర్పంచ్ పాపులమ్మ భర్త మల్లప్ప గత కొంతకాలంగా ఆక్రమణల తొలగింపు పేరుతో సదరు చింతచెట్లను తొలగించేందుకు రెవిన్యూ అధికారుల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. చింత చెట్ల తొలగింపును అడ్డుపెట్టుకుని అక్కడే ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని తీసివేసేందుకు కుట్రపన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

చదువుతోనే దైనందిక జీవితంలో మార్పు

తంబళ్లపల్లె: మండలంలోని మహిళా సంఘాలలోని నిరక్షర్యాస మహిళలు చదువుకున్నప్పుడే దైనిందిక జీవితంలో మార్పుతో పాటు సమాజంపై అవగాహన కలుగుతుందని ఏపీఎం గంగాధర్, ఏపీఓ అంజనప్ప తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సీసీలు, సంఘమిత్రలు అక్షర వలంటీర్లకు అక్షర ఆంధ్ర –ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. మహిళా సంఘాలలోని నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు.

సామాజిక ఇంజినీర్లుగా గుర్తింపు తెచ్చుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఎంఎల్ఎస్ దేవకుమార్

కురబలకోట: ఇంజినీరింగ్ విద్యార్థులు చదువు సంధ్యలతో పాటు వివిద కమ్యూనిటీ కార్యక్రమాలపై కూడా దృష్టి సారించి సామాజిక ఇంజినీర్లుగా గుర్తింపు తెచ్చుకోవాలని ఏపీ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ చైర్మన్ డాక్టర్ ఎంఎల్ఎస్ దేవ కుమార్ అన్నారు. అంగళ్లు మిట్స్ యూనివర్సిటీ ఫస్ట్ ఇయర్ బిటెక్ విద్యార్థులకు కమ్యూనిటీ కార్యక్రమాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వివిధ సమస్యలు ఉంటాయని వాటికి సాంకేతిక పరిష్కారాలు చూపవచ్చన్నారు. సమాజిక సేవా భావం, సమస్య పరిష్కార నైపుణ్యం సూచించాలన్నారు. సామాజిక సేవ కార్యక్రమాల వల్ల స్థానిక సామాజిక పరిస్థితులు స్థితి గతులు తెలిసిరాగలవన్నారు. కార్యక్రమంలో వీసీ, రిజిస్ట్రార్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

టమాటా మార్కెట్‌లో జాక్‌పాట్ పేరుతో దోపిడీ

గుర్రంకొండ: జాక్‌పాట్‌ల పేరుతో ఇష్టానుసారం రైతుల్ని వ్యాపారులు దోచుకొంటున్నారంటూ టమాటా రైతులు వాల్మీకిపురం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తరిగొండ నౌషాద్‌ఆలీకి ఫిర్యాదు చేశారు. సోమవారం ఆయన స్థానిక మార్కెట్ యార్డులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అప్పడే వ్యాపారులు నిర్వహిస్తున్న వేలంపాటల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా రైతులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వ్యాపారులకు పాలకవర్గమన్నా, అధికారులన్నా లెక్కలేదని రైతులు అన్నారు. ఎవరెన్ని ఫిర్యాదులు చేసినా వాళ్లను ఎవరు ఏమీ చేసుకోలేరనే ధీమాతో యార్డులో వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. జాక్‌పాట్‌లపేరుతో వందకు పది నుంచి 12 క్రేట్ల టమాటాలను బలవంతంగా తీసుకొంటున్నారని పేర్కొన్నారు. సమస్యలపై ఎన్ని మార్లు ఫిర్యాదు చేసినా మార్కెట్ యార్డులో పట్టించుకొనే వారు కరువయ్యారని రైతులు వాపోయారు. సమస్యలన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని వైస్ చైర్మన్ హామీ ఇచ్చారు.